క్లుప్తంగా

పొలాల్లో నెమలి లభ్యం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని పంట పొలాల్లో రైతుకు నెమలి దొరకడంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శేఖర్‌కు అప్పగించారు. నెమలి కాలు విరిగి నడవలేని స్థితిలో ఉండడంతో ఎస్ఐ శేఖర్ పశువైద్యశాలకు తరలించి చికిత్స అందించి అటవీ శాఖ సిబ్బందికి అప్పగించడంతో మహబూబ్‌నగర్‌లోని పార్క్‌కు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఐటీసీ కంపెనీ యాజమాన్యం హరి సర్వోత్తమ్మరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు పాఠశాల ఆవరణలో నాటారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. మానవపాడు మండలం చెన్నుపాడుకు చెందిన జయమ్మకు రూ.12 వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనం రైతన్న నేస్తం



మానవపాడు: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని పాలెం శాస్త్రవేత్త శంకర్, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం మద్దూరు గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి రకం ఆర్ఎన్ఆర్ 5208–20 యూనిట్లు ప్రతి యూనిట్‌లో 10 కేజీలు, పచ్చజొన్న 7 యూనిట్లు ప్రతి యూనిట్ 4 కేజీలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. క్యూఎస్ఈవీ క్షేత్రాలను సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. అనంతరం రైతులకు పంట నిర్వహణ తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడుదాం



అయిజ: బాల్య వివాహాలను సంపూర్ణంగా అరికడదామని సోషల్ మొబిలైజర్ మధు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు జరుగకుండా 100 లేదా 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాన్య, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సిబ్బంది లలిత, ధనలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి విజయవంతం చేద్దాం



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో వాల్మీకి నాయకులు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 7న వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. రైతు సంబరాలు, మూడు బండ్ల గిరక, సందెరాళ్ల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం



ఎర్రవల్లిలో చెరువును తలపిస్తున్న ఇళ్ల మధ్య మురుగు

- చెరువులను తలపిస్తున్న మురుగు
- వ్యాప్తి చెందుతున్న క్రిమి, కీటకాలు
- నివారణ చర్యలు శూన్యం

ఎర్రవల్లి: నెల రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో గ్రామాల్లో వర్షపు నీరు మురుగుగా మారి చెరువులను తలపిస్తున్నాయి. అదే విధంగా ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉండటంతో ఈగలు, దోమలు విచ్చలవిడిగా వ్యాప్తి చెందడంతో నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇళ్ల మధ్య, ఖాళీ స్థలాల్లో రోడ్లపై మురుగు కుంటలుగా నిలవడంతో ఈగలు, దోమలకు ఆవాసాలు మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎర్రవల్లి కూడలిలో ఇళ్ల చుట్టూ చేరిన మురుగు

చేపట్టని పారిశుద్ధ్య పనులు

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 65 వేల పైనే జనాభా ఉన్నారు. ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తొమ్మిది ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వైద్యాధికారులతో కలిపి 69మంది వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ వర్షాకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్నా గ్రామాల్లో పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పేర్కొంటున్నారు.

నామమాత్రంగా చర్యలు

ప్రతి శుక్రవారం గ్రామాల్లో వైద్య సిబ్బంది ఫ్రై డే, డ్రై డే పేరుతో పారిశుద్ధ్యంపై నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు నామమాత్రంగా చేపడుతున్నారు. గ్రామాల్లో మురుగు నీటిని తొలగించడం, ఆయిల్‌బాల్స్ వేయడం, ఫాగింగ్ చేయడం వంటి పనుల ఊసే లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆశా కార్యకర్తలు ఫీవర్ సర్వేలు కూడా సక్రమంగా చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో పదుల సంఖ్యలో జ్వరాలతో ప్రజలు మంచాలెక్కుతున్నా వైద్య సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడంలేదని, వారికి వైద్యం అందించేందుకు సైతం మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



షేకుపల్లి దారిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

చెరువును తలపిస్తుంది



వర్షాలతో గ్రామంలోని ఇళ్ల చుట్టూ వర్షపు నీరు కుంటలుగా ఏర్పడి చెరువును తలపిస్తుంది. డ్రెయినేజీ లేకపోవడం వల్ల చుట్టు పక్కల కాలనీల నుంచి మురుగు ఇళ్ల చుట్టూ చేరుతుంది.

– సత్యనారాయణ, ఎర్రవల్లి

దోమలతో సతమతం



గ్రామంలో డ్రెయినేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. మురుగు, వర్షపు నీరు కుంటలుగా ఏర్పడటంతో ఈగలు, దోమలు విచ్చలవిడిగా వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నాం.

– లక్ష్మన్న, సాసనూలు

ముందస్తు చర్యలు



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పంచాయతీ అధికారుల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నాం. పరిసరాలు, వ్యక్తిగత, ఆహార పరిశుభ్రతపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– రాధిక, మండల వైద్యాధికారి, ఇటిక్యాల

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ సంగీతలక్ష్మి

ధరూరు: రైతులకు అవసరమయ్యే ఎరువులను అందించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని వ్యవసాయ శాఖ ఏడీఏ సంగీతలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను, ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లకు, అధికారులకు తగు సూచనలు చేశారు. రైతులకు యూరియా అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు కూడా సంయమనం పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మల్దకల్: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జీహెచ్‌ఎం నరేష్, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య సూచించారు. గురువారం మండలంలోని అమరవాయి జడ్పీహెచ్ఎస్‌లో మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధన దిశగా ముందుకెళ్లాలన్నారు. మత్తు పదార్థాలను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో విష్ణు, సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులను పనికి పంపొద్దు



పొలంలో విద్యార్థులతో అధికారులు

కేటీదొడ్డి: చిన్నారులను పనులకు పంపకుండా పాఠశాలకు పంపాలని నందిన్నె కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయభాస్కర్ అన్నారు. మండల పరిధిలోని పూజారితాండ, గువ్వలదిన్నె గ్రామాల్లోని పొలాల వద్ద బడి బయట పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యతో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ప్రతినిధులు పద్మ, సరాగిణి, ఉపాధ్యాయులు అయేషా, సీఆర్పీ శివరాజ్, రాధిక పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



అయిజలో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

అయిజ: దళిత జర్నలిస్టుల ఫోరం 10వ రాష్ట్ర మహాసభలను విజయంతం చేయాలని దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం హైదరబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న సభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మునిస్వామి, జిల్లా అధికార ప్రతినిధి మైనర్‌బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జయన్న పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ధరూరు: దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటన్న కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే సభల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఏళ్ల తరబడిగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధిపొందక నానా ఇబ్బందులు పడుతూ పలువురు పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నారన్నారు. ప్రధానంగా అక్రిడిటేషన్ కమిటీలో ఒకరికి స్థానం కల్పించాలని, డబుల్ బెడ్రూం అందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న విలేకర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ఎలాంటి వేతనాలు లేకుండా పని చేస్తున్న జర్నలిస్టులపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అయిజ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకోసం అనుమతులు జారీ చేస్తే, ట్రాక్టర్ యజమానులు ఇతర పనులకు మట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జ్యోతి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు చేసిన మట్టి పక్కదారి పడుతుందన్న ఫిర్యాదు మేరకు గురువారం మండల కేంద్రంలో మట్టిని తరలిస్తున్న 7 ట్రాక్టర్లను తహసీల్దార్ నిలిపివేశారు. ఇందిరమ్మ ఇళ్లకు మంజూరైన వారికి ఒక్కొక్కరికి 8 ట్రాక్టర్ల మట్టి అనుమతి ఇస్తామని, మట్టిని అక్రమంగా తరలించకుండా అధికారిని నియమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రజనికాంత్‌రెడ్డి, పోలీసు బృందం పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్ల అందజేత



మల్దకల్: చోరీకి గురైన ఫోన్లను గుర్తించి బాధితులకు గురువారం అందజేసినట్లు ఎస్ఐ నందికర్ తెలిపారు. శేషంపల్లి గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి, మద్దెలబండ చిన్నతండా శంకర్, ఎమ్మిగనూరు చిన్న తిప్పయ్యకు చెందిన ఫోన్లు ఇటీవల చోరీకాగా సాంకేతిక పరిజ్ఞానంతో ట్రేస్ చేసి రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



గట్టు: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పేపర్ సంచులు, బట్ట సంచులు వాడాలని ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్‌కుమార్ కోరారు. గురువారం మండల పరిధిలోని మల్లంపల్లిలో ప్లాస్టిక్ వేరు చేసేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన పెద్ద సైజు కడ్డీల వాటర్ బాటిల్‌ను గ్రామంలో ఏర్పాటు చేశారు. గ్రామస్తులు వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఇందులో వేయాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం అమరేష్‌బాబు, జీవనోపాధుల అధికారి వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం సపోర్ట్ అధికారి మునిస్వామి, సీఓ నాగరాజు పాల్గొన్నారు.

రోగాల బారిన పశువులు

గట్టు: వింత రోగాల బారిన పడి పశువులు మృతి చెందుతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయాపురం, ఆరగిద్ద గ్రామాల్లో గడిచిన మూడు రోజులుగా పశువులకు విషజ్వరాలతో పాటుగా కొత్త రోగాల కారణంగా మృత్యువాత పడుతున్నట్లు వాపోతున్నారు. పశువులు మృత్యువాత పడుతున్న పశు వైద్యాధికారులు కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహించి, వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్లలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులు వారికి కేటాయించిన ఇళ్లలోనే నివాసం ఉండాలని సూచించారు. ఇప్పటికే విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ వసతులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జంబు రామన్‌గౌడ్, విజయ్, బాబర్, వేణుగోపాల్, పూడూరు కృష్ణ, నరహరిగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

క్యాంప్ కార్యాలయంలో గద్వాల మండలం రేపల్లె గ్రామానికి చెందిన పద్మమ్మకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.1.50 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న ప్రసన్నరాణి

మానవపాడు: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసన్నరాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక రోజు క్యాంప్ నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 160 మందికి పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు హేమమానస, హేమలత, యాకుబ్, రాఘవేంద్ర, తరుణ్, ఇంద్ర, అమూల్య, హెల్త్ సూపర్‌వైజర్ హెలెన్, అక్కమ్మ, చంద్రన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది



మల్దకల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులతో అధికారులు



గట్టులో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

మల్దకల్: ఎందరో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని తహసీల్దార్ ఝాన్సీరాణి, ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 14 మంది ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయమన్నారు. ఉపాధ్యాయులందరూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పాటును అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, జీహెచ్‌ఎం నరేష్, ఎంపీఓ రాజశేఖర్, సీఆర్పీలు వెంకటేష్, పద్మమ్మ, పరమన్న తదితరులు పాల్గొన్నారు.

గురుతర బాధ్యతను విస్మరించొద్దు

గట్టు: గురువులు తమ గురుతర బాధ్యతను విస్మరించొద్దని జిల్లా చేనేత, జౌళీ శాఖ ఏడీ, గట్టు స్పెషల్ అధికారి గోవిందరాజు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఎర్రవల్లి: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని జిల్లా టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాదిక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొండేరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి టీబీ హైరిస్క్ పాపులేషన్ స్క్రీనింగ్ ద్వారా 61 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం హైరిస్క్ ఏరియాలో ఉన్నవారికి, రక్తపోటు, డయాబెటిక్ ఉన్నవారిని గుర్తించి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో టీబీ నోడల్‌పర్సన్ ప్రభాకర్, ఎస్‌టీఎస్ విజయ్, సిబ్బంది వెంకటేష్, ఉదయ్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యకరమైన సమాజం



మల్దకల్‌లో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ/ఎర్రవల్లి/గట్టు/అలంపూర్‌రూరల్/మల్దకల్/శాంతినగర్ : స్వచ్ఛతతోనే ఆరోగ్యకరమైన సమాజం నెలకొంటుదని బీజేపీ అయిజ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం బీజేపీ నాయకులు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణాచారి, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రదీప్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు లక్షణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లిలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో నాయకులు చెత్త, చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, బీసన్న, నర్సింహులు, మోహన్‌గౌడ్, తిలక్‌రెడ్డి పాల్గొన్నారు.
- గట్టు మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్ప ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలోని శివాలయం పరిసరాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నోనిపల్లె నర్సింహులుగౌడ్, వీరశేఖర్‌గౌడ్, పరమేష్‌గౌడ్, ఇందువాసి ఆంజనేయులు, బల్గెర నాగప్ప తదితరులు పాల్గొన్నారు.
- కేంద్రం ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్ అన్నారు. అలంపూర్ మండలంలోని లింగనవాయిలో బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఇన్‌చార్జ్ జంగం నాగమల్లయ్య ఆధ్వర్యంలో చెత్త చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో నాయకులు దానరెడ్డి, సాయిబాబా, గుర్నాథ్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.
- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మల్దకల్ మండల కేంద్రంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నాయకత్వంలో దేశం శరవేగంగా ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, దామ నాగరాజు, తిమ్మప్ప, రెడ్డప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.
- వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, సేవా పక్షం ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ధరూరు: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని అల్వలపాడు ఎంపీహెచ్‌ఎస్‌ను ఎంఈఓ సందర్శించారు. విద్యార్థులు దసరా సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా జ్ఞానం పెంచుకోవాలన్నారు. ఎస్ఏ–1 పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతతో పాటు రుచిగా ఉండాలని వంట ఏజెన్సీకి సూచించారు. ఎఫ్ఏ 2 పరీక్షల మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డిలో భారీ వర్షం

కేటీదొడ్డి: మండలంలోని గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆకాశ మేఘావృతమై ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. పంట పొలాలకు ఈ వర్షం అనుకూలంగా ఉందని, సీడ్‌పత్తి సాగుకు మాత్రం ముసురు వర్షం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోయారు.

